

సమ్మక్క సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం బోర్డు



యూనివర్సిటీ తరగతుల నిర్వహణకు సిద్ధం చేసిన వైటీసీ భవనం

మోదీ వస్తారా.. పునాది వేస్తారా?

ములుగు, జూన్ 20: సమ్మక్క, సారక్క, జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణ పనులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కేంద్ర బడ్జెట్‌లో రూ.889 కోట్లు కేటాయించిన బీజేపీ ప్రభుత్వం మళ్లీ కొలువుదీరడం సానుకూలాంశం కాగా.. పునాదిరాయి పడటానికి ముహూర్తం ఎప్పుడొస్తుందనే చర్చ జరుగుతోంది. ములుగు జిల్లాలో మేడారం వనదేవతల పేరిట వర్సిటీ నిర్మాణం చేపడతామని గతంలో ప్రధాని మోదీ చెప్పడం, మార్చి 8న తాత్కాలిక క్యాంపస్ ప్రారంభ కార్యక్రమంలోకేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భూమి పూజకు మోదీని తీసుకొస్తామని ప్రకటించిన క్రమంలో ప్రధాని వస్తారా? శంకస్థాపన చేస్తారా? అన్న దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

తాత్కాలిక క్యాంపస్ ప్రారంభం

ములుగు మండలం జాకారం ట్రైబల్ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక క్యాంపస్‌ను మార్చి 8న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్రమంత్రి సీతక్కతో కలిసి ప్రారంభించారు. ఓఎస్డీగా నియమితుడైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వంశి అదే రోజు బాధ్యతలు చేపట్టారు. యూనివర్సిటీ భూమిపూజ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీని తీసుకొస్తామని, ఆయన చేతుల మీదుగానే పనులు మొదలుపెడుతామని కిషన్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ పెరగడం, ఊహించని విధం గా ఎంపీ సీట్లు రావడం లాంటి పరిణా మాల నేపథ్యంలో సెంట్రల్ వర్సిటీ శంకు స్థాపనకు ప్రధానిని తీసుకొచ్చి క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. కిషన్‌రెడ్డి మళ్లీ కేంద్ర మం త్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో వీలై నంత త్వరగా పనులు ప్రారంభించేందుకు చొరవ చూపాలని సర్వత్రా కోరుతున్నారు.



తాత్కాలిక క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి (ఫైల్)

- జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణంపై సర్వత్రా ఆసక్తి
- శంకుస్థాపనకు ప్రధానిని తీసుకొస్తానన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- మూడోసారి కేంద్రంలో బీజేపీ రావడం సానుకూలాంశం
- ఇప్పటికే రూ.889 కోట్ల కేటాయింపు
- మార్చి 8న ప్రారంభమైన తాత్కాలిక క్యాంపస్

పూర్తయిన భూసేకరణ

సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ కోసం భూసేకరణ ప్రక్రియ ఎప్పుడో పూర్తయింది. జిల్లా కేంద్రం సమీపంలో 163 జాతీయ రహదారిని ఆనుకొని గట్టమ్మ దేవాలయం సమీపంలో 287 ఎకరాల ప్రభుత్వ భూమి, 50.12 ఎకరాల అటవీ భూములను అధికారులు సిద్ధం చేశారు. అటవీ శాఖ నుంచి సేకరించిన స్థలంలో నిబంధనల మేరకు ఎలాంటి నిర్మాణాలు చేయకుండా సామాజిక అడవుల పెంపకం, ఉద్యానాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈనెల 13న వర్సిటీ ఓఎస్డీ వంశి ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ అధికారులు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. హద్దుల చుట్టూ గుర్తులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల నిర్మాణాల బాధ్యతను సెంట్రల్ పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సీపీడబ్ల్యూడీ) పర్యవేక్షిస్తుండగా గ్రీన్‌సిగ్నల్ అందిన వెంటనే పనులు మొదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదిలా ఉంటే 2024-25 విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించే ప్రక్రియ అమలులో ఉంది. నాలుగేళ్ల కాలపరిమితితో బీఏ (ఇంగ్లిష), బీఏ (సోషల్ సైన్స్) కోర్సులను ప్రవేశపెట్టి దరఖాస్తులు కూడా ఆహ్వానించారు. జూలైలో అడ్మిషన్ ప్రక్రియ పూర్తిచేసి ఆగస్టులో తరగతులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒక్కో కోర్సులో 32 చొప్పున సీట్లు ఉండగా గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఎనిమిది చొప్పున సూపర్ న్యూమరరీ సీట్లను కేటాయించారు. మొత్తం సీట్ల భర్తీలో గిరిజనులకు 40.5శాతం రిజర్వేషన్ అమలవుతుంది.

ప్రతీ రైతుకు పథకాలందేలా కృషి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



- ఉమ్మడి వరంగల్ రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- చైర్మన్ పదవితో బాధ్యత మరింత పెరిగింది
- డీసీసీబీ టర్నోవర్ రూ.870కోట్ల నుంచి రూ.1,931 కోట్లకు తెచ్చా
- 78,432 మంది రైతులకు రూ.529.44 కోట్ల రుణమాఫీ
- పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తిని కాదు
- భవిష్యత్తు రాజకీయాల గురించి ఇప్పుడే ఏం చెప్పలేను
- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

వివరాలు 7లో...

'వరంగల్ డీసీసీబీ 107ఏళ్ల చరిత్రలో తొలిసారి రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి దక్కింది. నాకు వచ్చిన ఈ అవకాశంతో ఓరుగల్లు రైతుల అభివృద్ధికి కృషి చేస్తా. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతీ పథకం చేరేలా దృష్టి పెడతా. ఇప్పటికే కొత్తగా 12బ్యాంకులను తీసుకొచ్చా. మరో ఐదు కొత్త బ్యాంకుల కోసం ప్రతిపాదనలు పంపించా' అని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. భవిష్యత్తు రాజకీయాలపై ఇప్పుడే ఏం చెప్పలేనని, పదవుల కోసం తాను పార్టీ మారే వ్యక్తిని కాదని, టెస్కాబ్ చైర్మన్ పదవి వస్తుందని కూడా ఊహించలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతులకు మేలు జరుగుతోందంటున్న మార్నేని రవీందర్‌రావు గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో ప్రత్యేకంగా ముచ్చటించారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కరెన్సీ నోట్ల కలకలం

మంగపేట, జూన్ 20: మండలంలోని మల్లూరు సమీపంలో బూర్గంప హాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారి పక్కన కరెన్సీ నోట్ల కట్టలు లభ్యమయ్యా యనే వార్త గురువారం కలకలం రేపింది. బ్యాగులో నోట్ల కట్టలు ఉన్న దృశ్యం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన నోట్ల కట్టలు పడేసి వెళ్లారని, అవి గ్రామంలోని ఇద్దరికి లభ్యమయ్యాయని ప్రచారం జోరుగా జరిగింది. ఈ నోట్ల కట్టల్లో రెండు వేల నోట్లు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ డబ్బులు ఎవరికి దొరికాయోననే విషయం మాత్రం వెల్లడికాలేదు. దీనిపై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఇందంతా ఫేక్ వార్త అని కొట్టిపారేశారు.



సోషల్ మీడియాలో వైరల్ అయిన డబ్బుల బ్యాగు

ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలి

భూపాలపల్లిటౌన్, జూన్ 20: పదోన్నతులు కల్పిస్తున్న నేపథ్యంలో ఖాళీ అవుతున్న ఉపాధ్యా య పోస్టులను కూడా ఈ దఫాలోనే భర్తీ చేయాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెండెం మధుసూదన్, ప్రధాన కార్యదర్శి కూచనపల్లి రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు విద్యాశాఖ ఏడీ రాజేందర్‌కు గురువారం వినతి పత్రాన్ని అందించారు. ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ చేయడం, పదోన్నతులు కల్పించడం శుభపరిణామమని అన్నారు. అయితే.. ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న పదోన్నతుల నేపథ్యంలో కొన్ని సాంకేతిక లోపాల మూలంగా ఖాళీలు అధికంగా ఉంటున్నాయని అన్నారు. అలా మిగిలిపోతున్న ఖాళీలను వెంటనే భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



చెల్పూరు జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

గణపురం, జూన్ 20: నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. మండలంలోని చెల్పూరు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ హాజరై విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. 0-19సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఈ కార్యక్రమం ప్రతి ఆరు నెలలకోసారి జరుగుతుందన్నారు. జిల్లాలో 65వేల మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌ల కింద ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కొమురయ్య, ప్రోగ్రాం అధికారి పవన్, ఎంపీపీ రజిత, ఎంపీటీసీ సుధర్మ, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ములుగు జిల్లాలో..

ములుగు కలెక్టరేట్ : జిల్లాలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య ప్రారంభించారు. ములుగు మండలంలోని బండారుపల్లి తెలంగాణ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంపై నులిపురుగుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, రక్తహీనత, పోషకాలలోపం, ఆకలి మందగించడం, బలహీనత, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఏర్పడతాయని అన్నారు. వాటి నివారణ కోసం పిల్లలందరూ అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రణధీర్ మాట్లాడుతూ జిల్లాలో 611 అంగన్‌వాడీ కేంద్రాల్లో 13,349 మంది, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 73,544 మంది పిల్లలు ఉన్నారని అన్నారు. వారందరికీ అల్బెండజోల్ మాత్రలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, రాయినిగూడెం వైద్యాధికారి ప్రసాద్, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం వైద్యాధికారులు మల్లికార్జున్, శ్రీలత, వైద్యాధికారులు, సిబ్బంది తిరుపతయ్య, సంపత్, దుర్గారావు, భాస్కర్, సంపత్‌రావు, సాంబయ్య, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాకీ చొక్కాకు నేరాల మరక!

- పెడదారి పడుతున్న 'నాలుగో సింహం'
- పోలీసు శాఖ పరువును బజారున వేస్తున్న కొందరు అధికారులు, సిబ్బంది
- హద్దులు మీరుతూ దుశ్చర్యలు
- వరుస ఘటనలతో డిపార్ట్‌మెంట్‌కు చెడ్డపేరు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 20: ఖాకీ చొక్కాలకు నేరాల మచ్చ అంటుకుంటోంది. కొందరు అధికారుల వ్యవహార శైలి వల్ల పోలీసు శాఖ అప్రతిష్ఠపాలవుతోంది. భూపాలపల్లి జిల్లాలో వరుసగా చోటుచేసుకుంటున్న సంఘటనలే ఇందుకు నిదర్శనం. బాధ్యతలను మరచి పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. నీతి, నిజాయతీ గల అధికారులు, సిబ్బందికి కూడా ఇవి చెడ్డ పేరు తెచ్చి పెడుతున్నాయి. ఎక్కడా లేని విధంగా ఇలాంటి ఘటనలు జిల్లాలో చోటుచేసుకోవడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది.



జిల్లాలోని పోలీసు శాఖలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనలన్నీ పెను సంచలనాలే. రాష్ట్ర స్థాయిలో ఇవి మార్మోగాయి. ఇక్కడి పోలీసుల వ్యవహారం ఏకంగా సీఎం దృష్టిలో పడేంతగా చోటుచేసు కోవడం చర్చనీయాంశమయ్యాయి. ప్రధానంగా రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో భూపాలపల్లి జిల్లా ఏఎస్పీగా పని చేసిన భుజంగరావు హస్తం ఉండటం ఇక్కడి పోలీసులను కలవర పర్చింది. విధుల్లో ఉన్న ఆయన్ను భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయం నుంచి హైదరాబాద్ స్పెషల్ బ్రాంచి సిబ్బంది అరెస్టు చేసి తీసుకెళ్లారు. మరో వైపు ఓ బాలిక లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వీఆర్ విభాగంలో పనిచేసిన సీఐ సంపత్‌పై పోక్సో కేసు నమోదు కావడం సైతం కలకలం రేపింది. అలాగే మొగుళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్ బర్త్‌డే పార్టీని స్వయంగా ఎస్సై జరపడం, కేక్ కట్ చేయడం చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో ఆ ఎస్సైను పోలీసు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఇదే క్రమంలో మహదేవపూర్ పోలీసు స్టేషన్‌లో కాంగ్రెస్ నేత గుడాల శ్రీనివాస్ స్టెప్పులు వేయడం సైతం వైరల్ అయ్యింది. ఈ ఘటనలో ఎస్సై బదిలీ కాగా హెడ్ కానిస్టేబుల్ సస్పెండ్ అయ్యాడు. అలాగే పలు అవినీతి ఆరోపణల నేపథ్యంలో అదే పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఆరుగురు కానిస్టేబుళ్లు సైతం బదిలీ కావడం జిల్లా పోలీస్‌శాఖను కుదిపేసింది. ఇవన్నీ చాలవన్నట్టు తాజాగా కాళేశ్వరం ఎస్సై భవానీసేన్ తీరు హాట్ టాపిక్ అయింది. మహిళా హెడ్‌కానిస్టేబుల్‌పై లైంగిక దాడికి పాల్పడి న ఆయన్ను అరెస్టు చేయడం, సర్వీస్ నుంచి తొలగించడం చర్చకు దారి తీసింది.

పలుకుబడి ఉన్నోళ్లకే ప్రాధాన్యం

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఠాణాల్లో పలుకుబడి ఉన్నోళ్లకే పోలీసు అధికారులు ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. వివిధ సమస్యల నిమిత్తం వచ్చే బాధితుల పట్ల ఉదాసీనగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఠాణాల్లో వివిధ విభాగాల్లో పనిచేసే సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లకు ఉన్న గన్‌మన్లు కీలక పాత్ర పోషిస్తూ అన్నీ తామై రాజ్యమేలుతున్నారనే చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. అధికారులు మారినా.. గన్‌మన్లు మారకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వారు చెప్పిందే వేదంగా పోలీస్ అధికారులు కూడా నడుచుకోవడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజానీకానికి ఇబ్బందులు తప్పడం లేదు.

భవానీసేన్ బాటలో మరో ఇద్దరు!

జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారుల్లో మరో ఇరువురు అధికారులు సైతం భవానీసేన్‌గౌడ్ బాటలోనే నడుస్తున్నట్లు చర్చ జరుగుతోంది. తమ పరిధిలో పనిచేసే మహిళా ఉద్యోగుల పట్ల, ఠాణాకు వచ్చే మహిళా బాధితుల పట్ల వారి ప్రవర్తన సరిగా ఉండటం లేదనే టాక్ వినిపిస్తోంది. ప్రధానంగా కాటారం సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఓ అధికారితోపాటు చిట్యాల సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మరో అధికారి వ్యవహార శైలి భవానీసేన్ గౌడ్‌లాగే ఉంటోందనే ప్రచారం జరుగుతోంది. అయితే.. భవానీసేన్‌గౌడ్ వ్యవహారం తెరపైకి రావడం, ఆయన అరెస్టు కావడంతో కంగుతిన్న ఆ ఇద్దరు అధికారుల్లో మార్పు మొదలైందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

మహదేవపూర్ సీఐపై బదిలీ వేటు?

మహదేవపూర్ : మండలంలోని కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ డిస్మిస్ నేపథ్యంలో మహదేవపూర్ సీఐపై బదిలీ వేటు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం కాళేశ్వరం ఎస్సై భవానీ సేన్ మహిళా కానిస్టేబుల్‌పై లైంగిక దాడి చేశారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు రావడంతో అతడిని అరెస్టు చేసి డిస్మిస్ చేశారు. ఈ నేపథ్యంలో పర్యవేక్షణాధికారిగా ఉన్న మహదేవపూర్ సీఐపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

'నీట్' పేపరు లీకేజీపై నిరసన

సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం, సీపీఐ డిమాండ్

ములుగు కలెక్టరేట్/కాకతీయఖని, జూన్ 20: నీట్ పేపరు లీకేజీపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ములుగు కలెక్టరేట్, భూపాలపల్లిలోని అంబేద్కర్ సెంటర్ వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. ములుగు కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నా సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈఏడాది మే 5న 4,750 కేంద్రాల్లో నీట్ పరీక్ష జరగ్గా 24 లక్షలమంది హాజరయ్యారని అన్నారు. మే 4న బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో విద్యార్థి ఒకరికి రూ.30లక్షలు అందించి పేపర్ లీక్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయని అన్నారు. ఈవిషయంలో 13 మందిని పోలీసులు ఇప్పటికే దర్యాప్తు చేస్తున్నారని అన్నారు. నీట్ ఫలితాలు, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు ఒకేసారి రావడంతో అనుమానాలకు దారితీస్తోందన్నారు. గత పదేళ్ల నుంచి ఫస్ట్ ర్యాంకు ఇద్దరు, ముగ్గురికి మాత్రమే వచ్చేదని, ఈఏడాది మాత్రం 69మంది విద్యార్థులకు 720మార్కులు రావడం, అది కూడా ఒకే సెంటర్‌లో ఏడుగురు విద్యార్థులకు రావడం అనుమానాలకు బలమిస్తోందన్నారు. 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే దశలవారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎమ్డీ.గఫూర్‌పాషా, నాయకులు కొర్ర రాజు, రత్నం ప్రవీణ్, చంద్రయ్య, నర్సింహ, రాజు, దేవేందర్, సద్దాంహుస్సేన్, రాజన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే భూపాలపల్లిలో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు రాజయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీరుతో విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంగా మారే అవకాశం ఉందన్నారు. కష్ట పడి చదివే విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం సరికాదన్నారు. పేపర్ లీకేజీకి పాల్పడిన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలుపున్న సీపీఐ శ్రేణులు



ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పీఎం దిష్టిబొమ్మ దహనం

నీట్ పేపర్ లీకేజీపై జ్యుడీషయల్ విచారణ జరిపించాలని సీపీఐ భూపాలపల్లి పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో పీఎం నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ లీకేజీల వల్ల విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడుతుందన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సతీష్, జోసెఫ్, శ్రీకాంత్, తిరుపతి, రమేష్, యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి..

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 20: రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం జరుగనున్న నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రిని విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భోగేశ్వర్ మాట్లాడారు. పాఠశాలల్లో స్కావేంజర్లను నియమించాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, 317 బాధితులకు న్యాయం చేయాలన్నారు. పీఆర్సీ కమిటీని నియమించి పెండింగ్ నాలుగు బిల్లులను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, స్వామి, వీరస్వామి, మల్లయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు పథకాలందేలా కృషి

● ఉమ్మడి వరంగల్ రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ● టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

తనకు వచ్చిన అవకాశంతో ఉమ్మడి జిల్లా రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని, ప్రతీ ప్రభుత్వ పథకాన్ని రైతులకు చేర్చే విధంగా దృష్టి పెడతానని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. ఇటీవల టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులైన ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికిచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు మాట్లాడారు. వరంగల్ డీసీసీబీ 107ఏళ్ల చరిత్రలో తొలిసారి రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి దక్కిందని, ఇప్పటికే కొత్తగా 12బ్యాంకులను తీసుకవచ్చానని, మరో ఐదు కొత్త బ్యాంకుల కోసం ప్రతిపాదనలు పంపించానని వివరించారు. పదవుల కోసం పాకులాడే తత్వం తనది కాదని, తనకు ఈ టెస్కాబ్ చైర్మన్ పదవి వస్తుందని కూడా ఊహించలేదన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి : టెస్కాబ్ చైర్మన్ పదవి రావటంపై మీ స్పందన?

మార్నేని రవీందర్‌రావు : వరంగల్ సహకార బ్యాంకుకు 107 ఏళ్ల చరిత్ర ఉంది. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో చైర్మన్ పదవి దక్కింది లేదు. సీఎం రేవంత్‌రెడ్డి, వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో టెస్కాబ్ చైర్మన్ పదవి దక్కడం చాలా ఆనందంగా ఉంది. తొలిసారి వరంగల్‌కు వచ్చిన ఈ పదవితో ఓరుగల్లు రైతులకు సాధ్యమైనంత వరకు మేలు చేసేలా ప్రణాళిక రూపొందించుకుంటున్నా. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు లక్షల మందికి పైగా రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు డీసీసీబీల ద్వారా చేరేలా కృషి చేస్తా.

ఆంధ్రజ్యోతి: చైర్మన్ పదవి వస్తుందనే కాంగ్రెస్‌లోకి వెళ్లారా?

మార్నేని: అసలు టెస్కాబ్ చైర్మన్ పదవిపై ఎప్పుడూ ఆశ కూడా పడలేదు. పదవుల కోసం పార్టీ మారే వ్యక్తిని కాదు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న విధానం నాకు నచ్చింది. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, అమలుకు శ్రీకారం చుడుతున్న దమ్మున్న సీఎం రేవంత్‌రెడ్డి. ఆయన నాయకత్వంలో పని చేస్తే రైతులకు మేలు జరుగుతుందనే ఆశతో కాంగ్రెస్‌లో చేరా. నేను కాంగ్రెస్‌లో చేరిన తరువాతే టెస్కాబ్ చైర్మన్ స్థానం ఖాళీ అయింది. ఊహించని విధంగా నాకు చైర్మన్ పదవి దక్కింది. దీంతో ఈ పదవితో వరంగల్ రైతులకు సేవ చేయాలనే బాధ్యత మరింత పెరిగింది.

ఆంధ్రజ్యోతి: డీసీసీబీ చైర్మన్‌గా సాధించిన ప్రగతి ఏంటి?

మార్నేని: 2020లో డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నప్పుడు రూ.870కోట్ల టర్నోవర్ మాత్రమే ఉండేది. ఈ నాలుగేళ్ల కాలంలో రూ.1,930.70కోట్లకు బ్యాంకుల లావాదేవీలు పెంచాము. అంతేకాకుండా ఎంపీఏ రేటు 7.5శాతంగా ఉండేది. ప్రస్తుతం 2.99 శాతానికి చేర్చాం. చాలావరకు మొండి బకాయిలను వసూలు చేశాం. కొత్తగా 12 బ్యాంకులను ఏర్పాటు చేశాం. మరో 11బ్యాంకుల ఏర్పాటు కోసం ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపాం. మొత్తం రూ.1,395.18కోట్ల రుణాలు ఇవ్వగా, ఇందులో వ్యవసాయ రుణాలు రూ.573.73కోట్లు కాగా, వ్యవసాయేతర రుణాలు రూ.822.50కోట్లు ఇచ్చాం. రూ.540.56కోట్ల డిపాజిట్లు సేకరించి రాష్ట్రంలోనే వరంగల్ డీసీసీబీని అగ్రగామిగా నిలబెట్టాం.

ఆంధ్రజ్యోతి: ఎంతమంది రైతులకు వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలిచ్చారు?

మార్నేని: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 70సహకార సంఘాలు ఉండగా, 78,432మంది సభ్యులున్నారు. 32డీసీసీబీ బ్యాంకుల బ్రాంచిలున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు గత డిసెంబరు 9వ తేదీలోపు రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న 78,432మంది రైతులకు రూ.529.44కోట్ల రుణమాఫీ చేయాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అలాగే వ్యవసాయేతరమైన దీర్ఘకాలిక (ఎల్‌టీ), గోల్డ్, ఎస్‌ఏవో, జేఎల్‌జీ, ఎడ్యుకేషన్, హౌసింగ్, వాహనాలు, వ్యక్తిగత తదితర 18రకాలకు పైగా రుణాలకు రూ.1395.18కోట్లు డీసీసీబీ ద్వారా అందించటం జరిగింది. నాబార్డు సహకారంతో ఆత్మ నిర్బర్ అభియాన్ భారత్‌ను అమలు చేస్తున్నాం. దీని ద్వారా రూ.2కోట్ల వరకు రుణాన్ని ఏడేళ్లలో చెల్లించేలా కేవలం 8పైసల వడ్డీకే అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: కొత్తగా బ్యాంకులు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?

మార్నేని: ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగేళ్ల కాలంలో కొత్తగా 12బ్యాంకులను ఏర్పాటు చేశాం. పర్వతగిరి, పాలకుర్తి, కొడకండ్ల, కేసముద్రం, చిట్యాల, ఏటూరునాగారం, ధర్మసాగర్, ఐనవోలు, మొగిలిచర్ల, తరిగొప్పుల, ములుగు గణపురం, నల్లబెల్లి కేంద్రాల్లో కొత్త బ్రాంచిలను ప్రారంభించాం. అలాగే కురవి, మొగుళ్లపల్లి, దేవురుప్పుల, రఘునాథపల్లి, సంగెం, హసన్‌పర్తి, మంగపేట, గీసుకొండ, నర్సింహులపేట, బచ్చన్నపేట, నెల్లికుదురు తదితర 11ఏరియాల్లో నూతన బ్యాంకుల ఏర్పాటుకు ఆర్‌బీఐకి ప్రతిపాదనలు పంపాం.

ఆంధ్రజ్యోతి: మీ తదుపరి లక్ష్యం ఎమ్మెల్యే సీటుపైనేనా?

మార్నేని: భవిష్యత్ రాజకీయాలపై ఇప్పుడే ఏం చెప్పలేం. ఎమ్మెల్యేగా పోటీ చేయాలనే ఆలోచన



అయితే లేదు. కానీ, మూడు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఎలాంటి మచ్చ లేకుండా కొనసాగుతున్నా. పీఏసీఎస్ చైర్మన్‌గా, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా, డీసీసీబీ చైర్మన్‌గా, ప్రస్తుతం టెస్కాబ్ చైర్మన్‌గా పని చేస్తున్నాను. ఏ పదవిలో ఉన్నా ప్రజల సమస్యలను పరిష్కరించటం పైనే మొదటి ప్రాధాన్యం ఉంటుంది. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఓరుగల్లు రైతులకు మేలు జరిగేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టి పని చేస్తున్నా.

ఆర్థిక ఇబ్బందుల్లో నర్సులు

ఎంజీఎంలో వేతనాలు రాక రెగ్యులర్ నర్సుల అవస్థలు

వరంగల్ మెడికల్, జూన్ 20: ఎంజీఎం ఆస్పత్రిలో కొన్ని నెలల కిందట రెగ్యులర్ ప్రాతిపదికన నియామకమైన 127 మంది నర్సింగ్ ఆఫీసర్లు ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఐదు నెలల కిందట రాష్ట్రవ్యాప్తంగా బోధన ఆస్పత్రుల్లో నర్సింగ్ ఆఫీసర్ల నియామకమయ్యారు. ఇందులో 127మంది నర్సింగ్ ఆఫీసర్లు రెగ్యులర్ పద్ధతిలో ఎంజీఎంకు కేటాయించబడ్డారు. అయితే వీరికి ఎంప్లాయ్ ఐడీ, సీపీఎస్ నెంబరు కోసం ఎంజీఎం నుంచి ఖజానా కార్యాలయానికి పంపించాల్సి ఉంది. కానీ కొందరి నిర్లక్ష్యం వల్ల ఇంతకాలంగా జీతాలు అవడం లేదని వాపోతున్నారు.

కేఎంసీలో వేతనాల రికవరీ

కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఆఫీసర్ల జీతాల్లో కోత విధిస్తామని అధికారులకు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మూడు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా 138 మంది 2021 జూన్ 13వ తేదీన నియామకం అయ్యారు. వీరికి ప్రతీ నెల రూ. 25,140 జీతంగా చెల్లించారు. ఆ తరువాత 2022వ సంవత్సరం నుంచి 30శాతం జీతం పెరిగిందని, ప్రతీ నెల రూ.32వేలు జీతం చెల్లించారు. అయితే ఇంతకాలం చెల్లించాక పెరిగిన జీతం మీకు వర్తించదని పేర్కొంటూ ప్రతీ ఒక్క కాంట్రాక్టు నర్సింగ్ ఆఫీసర్ రూ.84 వేలు చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇది కూడా ప్రతీ నెల జీతంలో రికవరీ చేస్తామని కేఎంసీ అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కాంట్రాక్ట్ నర్సింగ్ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ మాట్లాడితే ఉద్యోగాలు తీసేస్తామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.650 కోట్ల బల్దియా బడ్జెట్‌కు ఆమోదం

సమష్టి కృషితో నగరాన్ని అభివృద్ధి చేస్తాం : మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 20: వరంగల్ నగర పాలక సంస్థ 2024-25 సంవత్సరానికి ముసాయిదా బడ్జెట్ అంచనాల మేరకు మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన పాలక మండలి ఆమోదించింది. ఈ సమావేశంలో 1/3 కోరం సభ్యులు హాజరైన తర్వాత బల్దియా అకౌంట్స్ పర్యవేక్షణాధికారి సరిత బడ్జెట్ అంచనాలను వెల్లడించారు. రూ.650.12కోట్ల అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌కు మెజారిటీ సభ్యులు చేతులెత్తి అంగీకారం తెలుపడంతో పాలకవర్గం బడ్జెట్‌ను అమోదించింది. ఇందులో రూ.237.02 కోట్లు సాధారణపన్నుల ద్వారా, రూ.410.10 కోట్లు వివిధ గ్రాంట్ల ద్వారా ఆదాయం సమకూరుతుందని అవచనా వేశారు.

ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మునిసిపల్ పట్టణ అభివృద్ధి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్ల సహకారంతో గ్రేటర్ వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. తాను మేయర్‌గా కొలువుదీరిన తర్వాత 2024-25 బడ్జెట్‌ను కలుపుకుని మూడోసారి బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించామన్నారు. ఈయేడు బడ్జెట్‌లో ప్రజలపై ఎక్కువ పన్నుల భారం మోపకుండా బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ బడ్జెట్ గ్రేటర్ 66 డివిజన్‌ల అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. ప్రధానంగా విలీనగ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పోచంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, డిప్యూటీ మేయర్‌తో పాటు వివిధ పార్టీల కార్పొరేటర్లు, ఎక్స్ ఎఫీషియో సభ్యులు పాల్గొన్నారు.

బల్దియా ఆదాయం

ట్యాక్స్ రెవెన్యూ	రూ.8,98కోట్లు
అసైన్డ్ రెవెన్యూ కంపన్‌సేషన్	------------
మున్సిపల్ ఆస్తుల అద్దెలు	రూ.12,66కోట్లు
టౌన్ ప్లానింగ్	రూ. 86,04కోట్లు
శానిటేషన్	రూ.18,97కోట్లు
ఇంజనీరింగ్	రూ.29,55కోట్లు
మొత్తం	రూ. 237,02కోట్లు

ఖర్చులు

సిబ్బందికి జీత భత్యాలు	రూ.80కోట్లు
పారిశుద్ధ్య నిర్వాహణకు	రూ.25,80కోట్లు
విద్యుత్ చెల్లింపులు	రూ.18,45కోట్లు
గ్రీన్ బడ్జెట్ 10 శాతం	రూ. 23,70కోట్లు
ఇంజనీరింగ్ విభాగానికి	రూ. 25,75కోట్లు
సాదారణ నిర్వాహణకు	రూ. 18,50కోట్లు
టౌన్ ప్లానింగ్	రూ. 1.20కోట్లు
డీఆర్ఎఫ్	రూ. 1.50కోట్లు
విలీన గ్రామాల అభివృద్ధికి	రూ. 14,04కోట్లు
ప్రజాసౌకర్యాల కల్పన	రూ. 5,20కోట్లు
వార్డుల అత్యవసర అభివృద్ధికి	రూ. 22,88కోట్లు

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 20: పదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 20 యేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు కం మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు చెప్పారు. అదేవిధంగా బాధిత బాలికకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హనుమకొండ కమలాపూర్ మండలం గునిపర్తి గ్రామానికి చెందిన ముత్యాల హన్మంతు 2017 సెప్టెంబరు 13న మధ్యాహ్నం 2 గంటలకు దివ్యాంగుల పాఠశాలలో చదువుతున్న ఓ బాలిక ఆడుకుంటుండగా ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో బాలిక అస్వస్థతతకు గురికావడంతో తల్లి విషయం తెలుసుకున్నది. హన్మంతు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు హన్మంతుపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎం.హరీష్ విక్రమ్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారులుగా సీఐలు సతీష్‌చందర్‌రావు, ఇ.హరికృష్ణ వ్యవహరించారు. కోర్టు లైజన్ అధికారిగా కె.పరమేశ్వరి, భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.


బాలికను బెదిరించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

వరంగల్ లీగల్, జూన్ 20: ప్రేమించమని, లేదంటే చంపుతానని బాలికను బెదిరించిన కేసులో మారెపెల్లి అనురుధ్‌కు రెండేళ్ల కారాగార శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా పోక్సో ప్రత్యేక కోర్టు కం మొదటి అదనపు సెషన్స్ జడ్జి బి.అపర్ణాదేవి గురువారం తీర్పు చెప్పారు. అదే విధంగా బాధిత బాలికకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన మారెపెల్లి అనురుధ్ 14 యేళ్ల బాలికను 2019 ఆగస్టు 9న ఉదయం 10.30 గంటలకు తన ఇంటి వెనకాల రాగానే అకస్మాత్తుగా బాలిక వద్దకు వచ్చి నోరు మూశాడు. తనను ప్రేమించాలని, లేదంటే బాలికను, ఆమె కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించాడు. దీంతో బాలిక విషయం తల్లిదండ్రులకు తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు.

కేసు విచారణంలో నేరం రుజువైనందున నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అదే విధంగా అంతకుముందు 2019 జనవరి 17న సాయంత్రం 6 గంటలకు బాలిక ఇంటి ముందుకు వచ్చి తనను ప్రేమించాలని, లేదంటే చంపుతానని బెదిరించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులోకూడా రెండేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అదే విధంగా రూ.50వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కాగా, ఈ రెండు కేసుల్లో విధించిన శిక్ష ఏకకాలంలో అనుభవించాల్సిందిగా న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు. కోర్టు పీసీ ఎ.రవి, సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారిగా ఎస్సై జి.రాజ్‌కుమార్ వ్యవహరించారు. కోర్టు లైజన్ అధికారిగా కె.పరమేశ్వరి, భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసులో సహకరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

బదిలీల ప్రక్రియకు కసరత్తు ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 20: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా బదిలీలకు రెండు జిల్లాల విద్యాశాఖలు రంగం సిద్ధం చేస్తున్నాయి. గురువారం రెండు డీఈవో కార్యాలయాల్లో డీఈవోలు సంబంధిత సిబ్బందిని బదిలీల పక్రియను వేగవంతం చేయాలని, ఖాళీలను గుర్తించి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్జీటీ, తత్సమాన అర్హత కలిగిన ఉపాధ్యాయులను బదిలీ చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. వరంగల్ జిల్లాలో సుమారుగా 556 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇక హనుమకొండ జిల్లాలో 452 మంది ఉపాధ్యాయులు బదిలీలు అయ్యే అవకాశం ఉంది.



బదిలీల ప్రక్రియ కసరత్తు చేస్తున్న డీఈవో అబ్దుల్‌హై

స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్, జూన్ 20: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) నేతృత్వంలో 40 రోజుల పాటు నిర్వహించే స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ తరగతులకు దరఖాస్తులు చేసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 10 నుంచి క్లాస్‌లు నిర్వహిస్తామని, జూలై 9 వరకు వర్సిటీ విద్యార్థులు ఉద్యోగులు రూ.వెయ్యి, ఇతరులు రూ.15 వందల చొప్పున క్యాంపస్ ప్రిన్సిపాల్ కార్యాలయంలో చెల్లించుకుని దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

రేపు కేయూలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సమావేశం

కేయూ క్యాంపస్, జూన్ 20: ఈనెల 22న శనివారం ఉదయం 10.30 గంటలకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సమావేశం సెనెట్‌హాల్‌లో ఏర్పాటు చేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 అల్మానాక్, కళాశాలల అనుబంధాలు, పరీక్షల షెడ్యూల్, స్పోర్ట్స్, గేమ్స్, ఎన్ఎస్ఎస్‌తో పాటు ఇతర అంశాలపై చర్చిస్తామని వెల్లడించారు. సంబంధిత డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ విధిగా హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

కేయూ క్యాంపస్, జూన్ 20: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాస్తుండగా పరీక్షల తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్‌లు మంగళవారం తెలిపారు. డీబారైన వారిలో నల్లగొండ ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఒక్కరు ఉన్నట్లు పేర్కొన్నారు. వారిపై పోలీసు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళలకు ఆర్టీసీ శుభవార్త

డీలక్స్ బస్సులో ప్రయాణిస్తే డ్రాలో బహుమతులు

బాలసముద్రం, జూన్ 20: ఆర్టీసీ డిలక్స్ బస్సులో ఉప్పల్ క్రాస్‌రోడ్-హైదరాబాద్ రూట్లలో ప్రయాణించే మహిళ ప్రయాణికులు టికెట్ పై డ్రా తీసి బహుమతులు ఇవ్వనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నెంబరు రాసి డ్రైవర్ పక్కన ఉండే లక్కీ డ్రా బాక్స్‌లో వేయాలని తెలిపారు. నెలలో రెండు సార్లు డ్రా తీసి ముగ్గురు మహిళలకు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలు డిలక్స్ బస్సుల్లో ప్రయాణించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో తెలిపారు.

వనదేవతలకు మొక్కులు



వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జూన్ 20 : తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు భక్తులు గురువారం మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. పూలు, పండు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, చీరలు, సారెలు, యాటలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవస్థానం పరిసరాల్లో చెట్టకింద వంటలు చేసుకొని తల్లులకు నైవేద్యాలు సమర్పించుకున్నారు. బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు. ఐదు వేలకు పైగా మంది భక్తులు మేడారం దేవతలను దర్శించుకున్నరని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు ఇబ్బందులు కలగొద్దు

ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా

ఏటూరునాగారం రూరల్, జూన్ 20: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలతోపాటు చిన్నబోయినపల్లి, మల్యాలలోని పాఠశాలలను ఆమె గురువారం పీవో తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య, హాజరు శాతంతో పాటు అడ్మిషన్లు, మౌలిక వసతులు, పరిశుభ్రత తదితర అంశాలను ప్రధానోపా ధ్యాయులు, వార్డెన్లను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలను బడుల్లో చేరేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, విద్యార్థుల ప్రతిభను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. విద్యార్థుల పట్ల అలసత్వం, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖపరమైన చర్యలుంటాయని పీవో హెచ్చరించారు. ఆమె వెంట ఏవో దామోదర స్వామి తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి వార్షిక ప్రణాళిక దిక్సూచి

● అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లిటౌన్, జూన్ 20: విద్యాభివృద్ధికి వార్షిక ప్రణాళిక దిక్సూచి లాంటిదని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఉపాధ్యాయులంతా విద్యాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. గురువారం ఆయన తన చాంబర్‌లో వార్షిక ప్రణాళిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని అన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన బృహత్తర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామ్‌కుమార్, ఏడీ రాజేందర్, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి శనిగరపు భద్రయ్య, ఎంఈవోలు ప్రభాకర్, పరీక్షల నియంత్రణ అధికారి రవీందర్‌రెడ్డి, సెక్టోరియల్ అధికారి రాజగోపాల్, కాగితపు లక్ష్మణ్, భాషా పండింతుల సంఘం అధ్యక్షుడు దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు.

అడవులను పరిరక్షించాలి

పోలీసు, ఫారెస్టు అధికారుల సమన్వయ సమావేశంలో డీఎస్పీ

కాటారం, జూన్ 20: నూతనంగా పోడు సాగు జరగకుండా చూడటంతో పాటు అడవులను సంరక్షించడానికి ఫారెస్టు, పోలీసు శాఖ సమన్వయంతో కృషి చేయాలని కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పోడు భూముల సమస్యలు, అడవుల సంరక్షణపై కాటారం సబ్ డివిజన్ పరిధిలోని అటవీ, పోలీస్‌శాఖ అధికారులతో డీఎస్పీ కార్యాలయంలో గురువారం కోఆర్డినేషన్ మీటింగ్ జరిగింది. డీఎస్పీ మాట్లాడుతూ ఎక్కడైనా కొత్తగా పోడు చేసినట్లయితే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అటవీ భూములను కబ్జా చేసేవారెవరైనా ఉపేక్షించొద్దన్నారు. పోడు సమస్యలు తలెత్తకుండా ఇరు శాఖలు పూర్తి స్థాయిలో అన్ని వనరులను ఉపయోగించుకుని కృషి చేయాలన్నారు. పోలీస్, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు, దాడులు నిర్వహిస్తూ అడవుల రక్షణకు పాటుపడాలని సూచించారు. సమావేశంలో కాటారం సీఐ నాగార్జునరావు, సబ్ డివిజన్ ఎస్సైలు అభినవ్, నరేష్, మహేందర్‌యాదవ్, తమాషారెడ్డి, పవన్, అటవీ శాఖ రేంజర్లు నరేందర్, కమల, డిప్యూటీ రేంజర్లు సురేందర్, రమేష్, ఎఫ్ఎస్‌వోలు చంద్రశేఖర్, లక్ష్మణ్ రావు, కృష్ణ, రమేష్, అర్చన, వినోద్, సుమన్, వరుణ్, ఇంతియాజ్, అంజయ్య, లక్ష్మణ్, అఫ్జల్, రాజేందర్, ఎఫ్‌బీవోలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, జూన్ 20: వర్షాకాలంలో వచ్చే వరదల పట్ల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని, పునరావాస కేంద్రాలు, అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని వివిధశాఖల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. జిల్లాలో గత సంవత్సరం సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవడం వల్ల వరదలు వచ్చి నష్టం వాటిల్లిందని, ఈఏడాది అలా జరుగకుండా అధికారులు ముందస్తుగా అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. వరదలు సంభవించినప్పుడు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టేవిధంగా ఉండాలని, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని అన్నారు. గ్రామస్థాయిలో మొబైల్ టీంను ఏర్పాటు చేయాలని, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సమాఖ్య సభ్యులు, రేషన్ డీలర్లు, యువతను సమన్వయపరుస్తూ ప్రణాళికాబద్ధంగా గ్రామాల్లో వరద ఉధృతికి కారణమయ్యే ప్రాంతాలను గుర్తించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని, ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులపై నీరు చేరిన మార్గాలు, పొంగుతున్న వాగులు దాటకుండా పటిష్ఠ నియంత్రణకు పోలీసుల సహాయంతో బారీకేడ్లు ఏర్పాటు చేయాలని, రహదారిపై రవాణా నియంత్రణకు సూచికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరి పరీవాహక గ్రామాల్లో వరద పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టాలని, ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ఈ సమా వేశంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సి.హెచ్.మహేందర్‌జీ, డీఎఫ్‌వో కిషన్‌జాదవ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(నూగూరు): వచ్చే మూడు నెలలు అధికారులు అప్రమత్తంగా ఉంటూ గోదావరి వరదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. గురువారం ఆయన అధికారులతో కలిసి మండలంలో పర్యటించారు. గోదావరి ముంపు ప్రాంతాలైన బల్లకట్టువాగు, కుక్కతోగువాగు, కంకల వాగులను పరిశీలించారు. గోదావరి వరదల వల్ల ఏయే ప్రాంతాలు వరద ముంపునకు గురవుతాయనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాగులు, వంకలు ఉప్పొంగి రహదారులపై రాకపోకలకు ఆటంకం ఏర్పడితే పడవలు అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణుల వివరాలను ముందుగానే సేకరించి ప్రసవం సమయానికి ఆస్పత్రులకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉండే గ్రామస్థులను ఎత్తయిన ప్రదేశాలకు తరలించాలని సూచించారు. అనంతరం పాలెం ప్రాజెక్టును కలెక్టర్ పరిశీలించారు. వరదల సమయంలో మండల అధికారులు, పంచాయతీ సిబ్బంది స్థానికంగా ఉండి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆ తర్వాత వీఆర్కేపురంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వే పనులను పరిశీలించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని, వివరాలు నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలన్నారు. సర్వే సమయంలో ఇబ్బందులు ఎదు రైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం మిషన్ భగీరథ నల్లాల పనితీరు, నీటి సరఫరా సక్రమం గా జరుగుతుందా? తదితర అంశాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి స్వర్ణ లత లెనిన, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ వీరభద్రప్రసాద్, ఎంపీవో హనుమంతరావు, మిషన్ భగీరథ డీఈ వెంకటసతీష్, ఏఈ శ్రీనివాసరావు, సీఐ రమేష్, ఎస్సై కొప్పుల తిరుపతిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

గోదావరి కరకట్ట నిర్మాణ పనులు ప్రారంభించాలి

మంగపేట: గోదావరి కరకట్ట నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ దివాకర ఆదేశించారు. మండల కేంద్రంలోని పొద్మూరు వద్ద గోదావరి నదిపై కరకట్ట పనులను ఆయన పరిశీలించారు. కరకట్ట నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అన్నారు. రూ.64 కోట్లతో 2.5 కిలో మీటర్ల మేర కరకట్ట నిర్మాణం పూర్తయితే గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న ముంపు గ్రామాలు సురక్షితంగా ఉంటాయన్నారు. కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ వీరస్వామి, ఇరిగేషన్ డీఈ రవికుమార్, ఏఈ వలీ మహ్మద్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దు

ములుగు ఎస్పీ శబరీశ్



గొత్తికోయ చిన్నారులకు చాక్లెట్లు, బిస్కెట్లు ఇస్తున్న ఎస్పీ

గోవింద రావు పేట, జూన్ 20: అసాంఘిక శక్తులకు ఎవరూ ఆశ్రయం కల్పించొద్దని ములుగు ఎస్పీ శబరీశ్ సూచించారు. డీఎస్పీ రవీందర్‌తో కలిసి మండలంలోని పస్రా పంచాయతీ పరిధిలోని బూడిదగడ్డ గొత్తికోయగూడాన్ని ఎస్పీ గురువారం సందర్శించారు. గొత్తికోయలను సమావేశపరిచి మాట్లాడారు. స్వార్థ ప్రయోజనాల కోసం అసాంఘిక శక్తులు గొత్తికోయగూడాల్లోని అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి బలి తీసుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈవిషయాన్ని గమనించి వారికి ఆశ్రయం కల్పించొద్దని, గూడాలకు కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సోలార్‌లైట్లు, ఇతర కనీస అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం గూడెంవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను తీర్చేలా చర్యలు తీసుకోవాలని గొత్తికోయలు ఎస్పీని కోరారు. అనంతరం గొత్తికోయ పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పస్రా ఎస్సై కమలాకర్, ఆర్ఎస్సై రాకేష్, సివిల్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

22న జంగాలపల్లి అంగడి వేలంపాట

ములుగు, జూన్ 20: ములుగు మండలం జంగాలపల్లి వారాంతపు సంత తైబజారు వేలంపాటలను ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సాదుల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల సంతకు రూ.3 లక్షలు, మేకలు/గొర్రెలకు రూ.3 లక్షలు, తైబజార్‌కు రూ.లక్ష విలువైన డిపాజిట్‌ను డీడీల రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

అమరువీరుల స్తూప నిర్మాణంలో భాగస్వాములు కావాలి : లక్ష్మణ్‌బాబు

మంగపేట, జూన్, 20: మంగపేట మండల కేంద్రంలోని గంపోనిగూడెం క్రాస్‌రోడ్ వద్ద నిర్మించనున్న తెలంగాణ అమరువీరుల స్థూపం నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు(లక్ష్మణ్‌బాబు) కోరారు. స్థూపం నిర్మాణ స్థలాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మంగపేటలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే ఆ కార్యక్రమంలో తాము కూడా భాగస్వామ్యం అవుతామని ప్రకటించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కుడుముల లక్ష్మీనారాయణ, రాజుయాదవ్, జిల్లా సమన్వయకర్తలు తాటి కృష్ణ, కాకులమర్రి ప్రదీప్‌రావు, మంగపేట సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, మల్లూరు గుట్ట మాజీ చైర్మన్ నూతలకంటి ముకుందం, సహకార సంఘం డైరెక్టర్లు సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావుగుప్తా, చిట్టిమల్ల సమ్మయ్య తదితరులు ఉన్నారు.

కూలిన భారీ వృక్షం.. ట్రాఫిక్‌కు అంతరాయం

తాడ్వాయి, జూన్ 20: మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలో ఏటూరునాగారం వైపు 163వ జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం భారీ వృక్షం నేలకూలింది. దీంతో ఏటూరునాగారం-హనుమకొండ వైపు వెళ్తున్న వాహనాలు సుమారు రెండు గంటలపాటు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, చంటిపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈక్రమంలో ములుగు కలెక్టర్ దివాకర ఏటూరునాగారం వైపు వెళ్తుండడంతో మార్గమధ్యలో ఈసంఘటన చోటుచేసుకుంది. దీంతో కలెక్టర్ స్పందించి ఫైర్‌స్టేషన్ సిబ్బందికి, పోలీసు అధికారులకు సమాచారం భారీ వృక్షాన్ని తొలగించాలని ఆదేశించారు. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో బ్లేడ్‌ట్రాక్టర్, జేసీబీ సహాయంతో వృక్షాన్ని తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాటారం, జూన్ 20:మండల కేంద్రమైన కాటారం గ్రామపంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీ జాడి మహేశ్వ గురువారం శంకుస్థాపన చేశారు. డీఎంఎఫ్‌టీ నిధులతో 17 బోర్లు మంజూరు కాగా గారెపల్లిలో బోర్ డ్రిల్లింగ్ పనులను ఏఈ రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. యాదవ కాలనీలో రూ.5లక్షల ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు కొట్టె శ్రీహరి, చీమల రాజు, కొట్టె ప్రభాకర్, పసుల మొగిలి, సత్యం, మహేష్, కొమురయ్య, జనార్ధన్, మహేందర్, రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులతో జాగ్రత్తగా ఉండాలి

వెంకటాపురం(నూగూరు), జూన్ 20: అసాంఘిక శక్తుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతిరావు అన్నారు. గురువారం మండలంలోని తిప్పాపురం పంచాయతీ పరిధిలోని కలిపాక గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై గ్రామస్థులను సమావేశపరిచి మాట్లాడారు. వర్షాకాలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉన్నందున గ్రామస్థులెవరూ ఈతకు పోవడం, చేపలు పట్టేందుకు వెళ్లవద్దని సూచించారు. గ్రామంలోకి ఎవరైనా అనుమానిత వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఎన్‌హెచ్ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు కలెక్టరేట్, జూన్ 20: 163వ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. ములుగు మండలంలోని మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి గట్టమ్మతల్లి దేవాలయం వరకు జరుగుతున్న జాతీయ రహదారి పనులను గురవారం ఆమె పరిశీలించారు. రోడ్డు పనులకు సక్రమంగా నీరందించాలని, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగంపెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలన

గోవిందరావుపేట : మండలంలోని రాంనగర్, చల్వాయి గ్రామాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వే పనులను గురువారం అదనపు కలెక్టర్ పి.శ్రీజ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండురోజుల్లో సర్వేను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

ప్రమాదకరంగా జాతీయ రహదారి : సీపీఎం

వాజేడు, జూన్ 20: మండలంలోని 163వ జాతీయ రహదారి ప్రమాద కరంగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బీరెడ్డి సాంబ శివ అన్నారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లా డారు. మండలంలోని పాయబాట్ల, సుందరయ్యకాలనీ, గుమ్మడిదొడ్డి, టేకులగూడెం గ్రామాల్లో ఉన్న జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారిందన్నారు. పెదగొల్ల గూడెం రోడ్డు విస్తరణ పనులను చేపట్టిన కాంట్రాక్టరు నాసిరకంగా పోయటం వల్ల రోడ్డు కుంగిపోయిందన్నారు. జగన్నాథపురం వైజంక్షన్ వద్ద విద్యుత్ లైట్స్ లేకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తు న్నాయన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, నాయకులు దేవయ్య, బచ్చల కృష్ణబాబు, దామోదర్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

వాజేడు, జూన్ 20: పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమం వాజేడు పీహెచ్‌సీ పరిధి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో గుఉవారం జరిగింది. నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా 19 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఎంపీపీ శ్యామల శారద, నాగారం మాజీ సర్పంచ్ తల్లడి ఆదినారాయణ, వైద్యాధికారి మహేందర్, ఎంఎల్‌హెచ్‌పీ జ్ఞానస, సీహెచ్‌వో సూర్యప్రకాశరావు, హెచ్ఎస్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గుర్రేవుల జడ్పీ హైస్కూల్‌లో మెడికల్ ఆఫీసర్ అభినవ్ ఆధ్వర్యంలో పిల్లలకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ఎస్‌వీ రమణ కుమారి,హెల్త్ అసిస్టెంట్లు కవిత, ఆశా పాల్గొన్నారు.

• ఏటూరునాగారం: మండల కేంద్రలంలోని ఆకులవారిఘణపురం ఆశ్రమ పాఠశాలలో రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుమలత విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. అలగే శంకరాజుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది.

• తాడ్వాయి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని వైద్యాధికారి రణధీర్ అల్బెండ జోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

• మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి నాగరాణి ఆధ్వర్యంలో నులి పురుగు నివారణ మందు పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. తహసీల్దార్ సునీత, ఇన్‌చార్జి ఎంపీడీవో హుస్సేన్, జడ్పీటీసీ సదయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ సునీత, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



టేకుమట్లలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి

• మల్హర్ : తాడిచర్ల ఉన్నత పాఠశాలల్లో నులి పురుగు నివారణ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, వైద్యాధికారి రాజు, ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రావు పాల్గొన్నారు.

• టేకుమట్ల: మండల వ్యాప్తంగా వైద్యాధికారి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో నులి పురుగు నివారణ మాత్రలు పిల్లలకు పంపిణీ చేశారు. ఎంపీపీ రెడ్డిమల్లారెడ్డి, జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

• రేగొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో నులిపురుగల నివారణ మాత్రలను పిల్లలకు పంపిణీ చేశారు. ఎంపీపీ పున్నం లక్ష్మి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• కాటారం: మండల వ్యాప్తంగా నులిపురుగు నివారణ మాత్రలను పిల్లలకు పంపిణీ చేశారు. మండలంలో 7,954 మంది పిల్లల్లో 7,794 మందికి మాత్రలను అందించినట్లు వైద్యాధికారి సుమన్ తెలిపారు. ఎంపీపీ సమ్మయ్య, ఎంపీటీసీ మహేశ్వరి, హెచ్ఈవో తిరుపతిరెడ్డి, హెచ్ఏలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

మహదేవపూర్, జూన్ 20: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఎడపల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చేకుర్తి బాణయ్య(45) నాలుగు రోజులుగా విపరీతంగా మద్యాన్ని సేవిస్తున్నాడు. ఆ మత్తులోనే ఇంట్లోని పురుగుల మందు తాగాడు. దీంతో భూపాలపల్లి ఆస్పత్రికి తర లిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కాటారం, జూన్ 20: స్కూటీని టిప్పర్ ఢీకొనడంతో ఒకరు గాయపడిన సంఘటన మండలంలోని కాటారం-మంథని ప్రధాన రహదారిపై ధన్వాడ సమీపంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్హర్ మండలంలోని కొండంపేటకు చెందిన మహ్మద్ అన్వర్ స్కూటీపై కాటారం మండల కేంద్రానికి వచ్చి ఇంటికి వెళ్తున్న క్రమంలో భూపాలపల్లి నుంచి మంథని వైపు వెళ్తున్న ఢీకొంది. దీంతో అన్వర్ గాయపడ్డాడు.

27లోగా ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 20: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలకు చేపట్టన పనులను ఈనెల 27లోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన గురువారం సమావేశమై అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతతో మౌలిక సౌకర్యాల పనులు చేపట్టిందని, జాప్య కావద్దనే ఉద్దేశంతో 25శాతం నిధులు ముందస్తుగా మంజూరు చేశామని అన్నారు. మరమ్మతులకు రూ. 14.21 మంజూరయ్యాయని తెలిపారు. ఇంకా చేపట్టని పనులను వెంటనే ప్రారంభించాల న్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో రామ్‌కుమార్, పీఆర్ ఈఈ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్

భూపాలపల్లిటౌన్, జూన్ 20: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు రోగాల బారినపడకుండా తగిన చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ అన్నారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమై సమీక్షించారు. వర్షాకాలం కాల్వల్లో నీరు నిలువకుండా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై నీరు నిల్వకుండా మట్టితో నింపాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అన్నారు. ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంటుందని, దోమలు, ఈగల నివారణకు అన్ని కాలనీల్లో చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ స్వామి, టెక్నికల్ అధికారి మానస, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్,శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రెయినీ ఐఏఎస్‌ల పర్యటన

మహదేవపూర్, జూన్ 20: ట్రైనీ ఐఏఎస్‌లు గురువారం పర్యటించారు. మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ఈశ్వర సత్యసాయి దుర్గమనోజ్, గరిమ ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి దర్శనం అనంతరం అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి, పండితులు ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓపెన్‌కాస్టు సందర్శన

గణపురం: సింగరేణి ఏరియా పరిధి మండలంలోని ఓపెన్‌కాస్టు-3ను ట్రైనీ ఐఏఎస్‌లు సందర్శించారు. శిక్షణలో భాగంగా సుమారు ఏడుగురు పర్యటించారు. ప్రాజెక్టు కాలపరిమితి, భూసేకరణ, బొగ్గు నిల్వలు, ఉత్పత్తి, రవాణా, పర్యావరణ పరిరక్షణకు సింగరేణి యాజమాన్యం చేపడుతున్న చర్యలు, భవిష్యత్ ప్రణాళిక, గ్రామాల తరలింపు తదితర అంశాలను ప్రాజెక్టు మేనేజర్ భిక్షమయ్యను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట తహసీల్దార్ మురళీధర్‌రావు, సింగరేణి అధికారులు ఉన్నారు.



ఓసీ-3లో ట్రెయినీ ఐఏఎస్‌ల బృందం

ఆదివాసీలకు న్యాయం చేయాలి

వెంకటాపురం(నూగూరు), జూన్ 20: మండలంలోని కొమురం భీం కాలనీ ఆదివాసీలకు న్యాయం చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ డిమాండ్ చేశారు. ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహారదీక్ష గురువారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా నాయ కులు వంటావార్పు నిర్వహించి నిరసన వ్యక్తంచేశారు. సంఘం నాయకులు, ఒంటిమామిడి గ్రామస్థులు పాల్గొన్నారు.